ఉద్యోగ అవకాశాలకు జాబ్‌మేళాలు దోహదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్: నిరుద్యోగ యువతీ యువకులకు అనుకూలంగా ఉండే ఉద్యోగ అవకాశాలు పొందేందుకు జాబ్‌మేళాలు ఎంతగానో దోహదపడుతాయని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బల్లాల అన్నారు. శనివారం అజంపురాలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఐటీ, ఐటీయేతర కంపెనీలా ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. దాదాపు 65 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొన్నాయని, అర్హులైన వారందరికీ ఉద్యోగ అవకాశాలు దక్కుతాయన్నారు. వృత్తి విద్యా నిపుణులు, నర్సులకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. ఇబ్నాత్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ మార్కెటింగ్ శిక్షణా కేంద్రాన్ని ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రారంభిస్తామన్నారు. జాబ్‌మేళాలో రెండు వేల మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారని ధృవ్ కన్సల్టింగ్ సర్వీసెస్ ఎండీ మన్మోహన్ తెలిపారు. జాబ్‌మేళాలో పలు కంపెనీలకు ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మినాజుద్దీన్, సలీం సాహిత్, నాయకులు సైపుద్దీన్ షఫీ, షేక్ మొహీయుద్దీన్, అబ్రార్, అలీం పాల్గొన్నారు.

వ్యాపారులు ఉన్నత స్థాయికి ఎదగాలి


మాట్లాడుతున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

వనస్థలిపురం: వ్యాపారులు తమ తమ రంగాలలో ఉన్నత స్థాయికి ఎదగాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శనివారం వనస్థలిపురంలోని గణేష్ కాన్ఫరెన్స్‌హాల్లో జరిగిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ మొదటి ఇన్‌స్టాలేషన్ ప్రోగ్రాం ఆఫ్ ఐసీఐ క్లబ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్లబ్ ఆధ్వర్యంలో వ్యాపారులకు వ్యాపార రంగంలో నూతన ఉత్తేజం, ప్రేరణను కలిగించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నందకిశోర్, సువిధ, నాగలక్ష్మి, శ్యాంసుందర్, నీరజ్, నవీన్, సతీష్, భావన శ్రీనివాస్, దూరయ్య, ఉపేందర్, శ్రీధర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి


స్థానికులతో మాట్లాడుతున్న పవన్ కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో కాలనీల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన శ్రీనాగేశ్వర్ నగర్ కాలనీలో ఆయన పర్యటించారు. కాలనీలో ఉన్న డ్రైనేజీ లైన్ సమస్యలను ఈ సందర్భంగా స్థానికులు కార్పొరేటర్‌కు వివరించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం రోడ్డు, విద్యుత్ స్తంభాలు, శానిటైజేషన్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ వెంట రామ్‌నాథ్ రెడ్డి, విజయ్ భాస్కర్, ప్రసాద్, రాజేశ్వర్ రెడ్డి, విశ్వేశ్వర్ రావు, నాగరాజు, భాస్కర్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో న్యాయవాదుల చేరిక

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున న్యాయవాదులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కిషన్‌రాజ్ చౌహాన్, పొన్నం అశోక్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పలు న్యాయస్థానాలకు చెందిన న్యాయవాదులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పొన్నం అశోక్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో న్యాయవాదులకు అన్నివిధాలా సహకారాలు అందిస్తామన్నారు. వీరి చేరికతో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు..

టమోటా రూ.19, వంకాయ రూ.23, బెండ రూ.23, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.23, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.16, క్యారెట్ రూ.40, దొండ రూ.20, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.50, గోకరకాయ రూ.23, దోసకాయ రూ.15, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.10, చిక్కుడుకాయ రూ.45, అర్వి రూ.40, మునగ రూ.35, చిలుకడ దుంప రూ.40.

రోడ్లపై గుంతలు ఉండొద్దు


అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: గణేష్ ఉత్సవాలు ప్రారంభయ్యేలోపు కాలనీల్లోని రోడ్లపై ఎలాంటి గుంతలు ఉండొద్దని కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం లింగోజిగూడ డివిజన్ వార్డు కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగకుండా సంబంధిత సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. ప్రతి ఇంటికి తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సరూర్‌నగర్ చెరువు చుట్టూ పరిశుభ్రంగా ఉండే విధంగా చెత్తాచెదారాన్ని తొలగించి చెరువులో గుర్రపు డెక్కను తొలగించాలని సూచించారు. సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ సరూర్‌నగర్ కట్ట వాకింగ్ ట్రాక్స్ వద్ద రాత్రి పూట ఇబ్బందులకు గురిచేస్తున్న పోకిరీలపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ జాకియా సుల్తానా, ఎస్ఐ గంగాధర్‌రెడ్డి, ఇంజనీరింగ్ డీఈ కార్తీక్, వాటర్ వర్క్స్ డీజీఎం సనాసిరావు, వివిధ శాఖల అధికారులు సత్యనారాయణ, శ్రీనివాస్, నగేష్ నాయక్, మన్నామా, నదీమ్, విజయ్‌కుమార్, పవిత్ర, జగన్నాథం, శ్రీకాంత్, హనుమంత్ పాల్గొన్నారు.

పీఓడబ్ల్యూను బలోపేతం చేయాలి


సదస్సులో మాట్లాడుతున్న అనసూయ

మలక్‌పేట: మహిళలకు బాసటగా నిలిచే పీఓడబ్ల్యూ బలోపేతానికి కృషి చేయాలని ఆ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనసూయ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని సిద్ధార్థ మహిళా కాలేజ్‌లో శనివారం నిర్వహించిన సదస్సుకు ఆమె హాజరై మహిళా సాధికారత అనే అంశంపై ప్రసంగించారు. ఆస్తి, రాజకీయ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ త్రివేణి, బీసీ వెల్ఫేర్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ బాలచందర్, సుజాత, నవ్య, ప్రేమలత,అఖిల పాల్గొన్నారు.


ఎస్ఆర్ఎల్ కాలనీలో వరద ధాటికి కొట్టుకుపోయిన రోడ్డుకు తాత్కాలికంగా మట్టిపోసిన దృశ్యం


ఎస్ఆర్ఎల్ కాలనీ రోడ్డు ఇలా..

వానొచ్చిందంటే రోడ్లు ఛిద్రమే!


గుంతలుగా మారిన ఎల్‌బీనగర్-ఉప్పల్ రోడ్డు

ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో వర్షం కురిస్తే చాలు ఆయా కాలనీలన్నీ గుంతలమయంగా మారడం పరిపాటిగా మారింది. భారీ ఎత్తున్న వరద నీరు రావడంతో రోడ్లన్నీ మునిగి చెరువులను తలపిస్తున్నాయి. కొత్తపేట డివిజన్‌లోని ఎస్ఆర్ఎల్ కాలనీ, బృందవన్ కాలనీలో వరద నీరు చేరి రోడ్లు మొత్తం ధ్వంసమయ్యాయి. స్నేహపురి కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వరద నీరు చేరింది. అల్కాపురి నుంచి ఉప్పల్ వెళ్లే రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నాగోలు చౌరస్తా నుంచి బండ్లగూడ, ఆనంద్‌నగర్ చౌరస్తా నుంచి ఓఆర్ఆర్‌కు వెళ్లే రెడియల్ రహదారి మార్గం గుంతలతో నరకయాతన తలపిస్తుంది. జీహెచ్ఎంసీ అధికారులు తాత్కాలిక రోడ్డు మరమ్మతులు చేసిన వర్షం పడిన వెంటనే రోడ్డుపై మళ్లీ గుంతలు ఏర్పడుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు. –నాగోలు


ఇటీవల కురిసిన వర్షానికి పారుతున్న వరద

వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

దిల్‌సుఖ్‌నగర్: వర్షాకాలంలో వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు నివారణ చర్యలు తీసుకోవాలని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్‌కేపురం డివిజన్‌లో వర్షాకాలంలో వ్యాప్తిచెందే వ్యాధులపై నిర్వహించిన అవగాహన సదస్సులో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, బోధకాలు, చికెన్ గున్యా వస్తాయన్నారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మన్సూరాబాద్: హయత్‌నగర్ పరిధి ప్రియదర్శిని కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కల్మెకొలన్ శేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నరసింహా, ప్రధాన కార్యదర్శిగా కే.సురేంద్రకుమార్, జాయింట్ సెక్రటరీగా ఆర్.బుచ్చిరెడ్డి, కోశాధికారిగా వెంకట్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.శంకర్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎం.సోమ్లానాయక్‌తో పాటు కార్యవర్గ సభ్యులు, ముఖ్య సలహాదారులు, గౌరవ సలహాదారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో చదువుకోవాలి



నాగోలు: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలలో చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని రంగారెడ్డి జిల్లా హెల్త్ క్యాంప్ చైర్మన్, లయన్ విజయరంగా అన్నారు. శనివారం కొత్తపేటలోని విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట తరపున విద్యార్థులకు డిక్షనరీలు అందజేసి విద్యార్థులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో త్రిపురనేని పద్మావతి, శ్రీకాంత్, శ్రీనివాసరావు, లక్ష్మీపార్వతి, ప్రభుదాస్, బ్రహ్మారెడ్డి, స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎలివేటెడ్ ఫ్లైఓవర్ల నిర్మాణానికి నిధులు మంజూరు


అధికారులతో కలిసి పనులు పరిశీలిస్తున్న ఎంపీ ఈటల

ఎంపీ ఈటల రాజేందర్

మన్సూరాబాద్: జాతీయ రహదారుల అభివృద్ధిలో భాగంగా పనామా, సుష్మ చౌరస్తాలు, హయత్‌నగర్ వద్ద ఎలివేటెడ్ ఫ్లైఓవర్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సెంట్రల్ అథారిటీ ఆఫ్ నేషనల్ హైవే శాఖ అధికారులు, కార్పొరేటర్లు, రాష్ట్ర ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి శనివారం ఆయన విజయవాడ జాతీయ రహదారి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అండర్‌పాస్ తరహా ఉండే ఫ్లైఓవర్లు వద్దని ఎలివేటెడ్ ఫ్లైఓవర్లు నిర్మాణం చేయాలని కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కారీ దృష్టికి తీసుకెళ్లానని, అంతేకాక నియోజకవర్గంలోని ఇతర రోడ్ల అభివృద్ధికి రూ.250కోట్ల నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. స్థానిక వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్దిష్టమైన ప్రణాళికలతో నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. జాతీయ రవాణాశాఖ ఏడీజీ రాజీవ్‌సింగ్, తెలంగాణ రీజినల్ ఆఫీసర్ పుష్ప, ఆర్ అండ్ బీ ఎస్ఈ ధర్మారెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, అధికారులు వెంకటేశ్వర్‌రెడ్డి, శరత్‌చంద్రా, నాయకులు సామ రంగారెడ్డి,చింతల సురేందర్‌యాదవ్, శ్రీధర్‌గౌడ్ ఉన్నారు.

ఎంపీకి వినతి ..

నాగోలు: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను శనివారం ఆయన నివాసంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్, కాలనీ వాసులతో కలిసి వినతిపత్రం అందజేశారు. నాగోలు డివిజన్ శ్రీనివాసకాలనీలో రోడ్లు, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయలు కల్పించాలి వినతిలో కోరగా ఎంపీ సానుకూలంగా స్పందించారన్నారు.

అనాథలకు చేయూతనివ్వడం బాధ్యత


విద్యార్థులకు బుక్స్, స్టేషనరీ అందజేస్తున్న థామస్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు కోల్డ్‌వెల్ రిచర్డ్ బ్యాంకర్ ఎల్లిస్ హైదరాబాద్ హెడ్ క్వార్టర్స్ గ్లోబల్ హెడ్ థామస్ శనివారం రూ.1.50 లక్షల విలువ గల రేషన్, పుస్తకాలు, స్టేషనరీని అందజేశారు. ఈ సందర్భంగా గ్లోబల్ హెడ్ థామస్ మాట్లాడుతూ.. అనాథ విద్యార్థి గృహం ఒక అద్భుతమైన వసతి గృహమన్నారు.అనాథలకు చేయూతనివ్వడం బాధ్యతగా భావించాలన్నారు. గృహంలోని 115 మంది విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరానికి రేషన్, స్టేషనరీ, దుస్తులు గొడుగులు, వస్తువులను అందజేశామన్నారు. భవిష్యత్‌లో గృహ విద్యార్థుల చదువులు పూర్తయిన తర్వాత తమ కంపెనీలో ఇంజినీరింగ్, అకౌంట్స్ విభాగాల్లో అర్హత కలిగిన విద్యార్థులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఆశిష్, రమాకాంత్, రమేష్, నరేష్, కంపెనీ స్టాఫ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

చంపాపేట: బీఎన్‌రెడ్డి డివిజన్ పద్మావతి కాలనీలోని బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధి కృషి చేస్తానని కార్పొరేటర్ లచ్చిరెడ్డి హామీ ఇచ్చారు. శనివారం నిర్వహించిన ఆలయ వార్షికోత్సవానికి ఆయన హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి శేష వస్త్రాలను పారిశుద్ధ్య కార్మికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజుగౌడ్, కిషన్, కిరణ్ పాల్గొన్నారు.

క్రీడలకూ ప్రాధాన్యం


క్రీడాకారులను సత్కరిస్తున్న డైరెక్టర్ రవిప్రసాద్

మన్సూరాబాద్: కాకతీయ విద్యాసంస్థల్లో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నామని మన్సూరాబాద్ సెంట్రల్‌బ్యాంక్‌కాలనీలోని కాకతీయ పాఠశాల డైరెక్టర్ రవిప్రసాద్ అన్నారు. రంగారెడ్డి జిల్లాస్థాయి అండర్-12 ప్రైవేటు పాఠశాలల ఆటల పోటీలను ఇటీవల నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న కాకతీయ పాఠశాల కబడ్డీ బాలుర జట్టు అత్యుత్తమ ప్రదర్శనతో ద్వితీయ బహుమతిని సాధించారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ పరిమళ విద్యార్థులను అభినందించి మాట్లాడారు. జిల్లాస్థాయి పోటీల్లో కాకతీయ పాఠశాల విద్యార్థులు సత్తా చాటడం గర్వంగా ఉందన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో దాగిన ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్ష బరిలో సాయికిరణ్



చంచల్‌గూడ: జాతీయ కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ ఎన్నికలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే నెల రెండోవారం ముగియనున్నాయి. పాతబస్తీలోని యాఖుత్‌పురా నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి కుర్మగూడ డివిజన్‌కు చెందిన బండి సాయికిరణ్ బరిలో ఉన్నాడు. 18- 35 సంవత్సరాల యువ ఓటర్లు తనకు మద్దతుగా ఓటు వేయాలని అభ్యర్థించారు. తనను వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ అదృశ్యం


గీతా

నాగోలు: రాఖీ పండుగా సందర్భంగా తన అన్నకు రాఖీ కట్టి తన నివాసానికి బయలుదేరిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నగరంలోని ఫలక్‌నుమా, జంగమ్మెట్‌కు చెందిన పరాశరం గీతా(38) నాగోలు జైపురికాలనీ, నువ్వులబండలో ఉండే కుతాడి రాజుకు ఈ నెల 19న రాఖీ కట్టేందుకు వచ్చింది. రెండు రోజులు అక్కడే ఉన్న గీతా ఈ నెల 22న జైపురికాలనీ బస్టాప్‌లో బస్సెక్కి ఫలక్‌నుమాకు బయలుదేరింది. ఎంతకీ గీతా రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో అన్న రాజు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పాత కేసు మూయిస్తానని డబ్బులు వసూలు

ముగ్గురిపై కేసు నమోదు

చంచల్‌గూడ: టాస్క్‌ఫోర్స్ పోలీసుల పేరుతో భయభ్రాంతులకు గురిచేసి పాత నేరస్తుడి వద్ద డబ్బులు వసూలు చేసిన ముగ్గురిపై కేసు నమోదైంది. ఛావుని డివిజన్‌లో నివాసముండే మహ్మద్ గౌస్ ఫిలింనగర్ పీఎస్‌లో చీటింగ్ కేసులో నిందితుడు. అతడి తోడల్లుడు షబ్బీర్ అలీఖాన్, 15 రోజుల క్రితం టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెతుకుతున్నారని భయభ్రాంతులకు గురి చేశాడు. తనకు పోలీసు ఉన్నతాధికారులు తెలుసని కేసు మూయిస్తానని రూ. 5 వేలు తీసుకున్నాడు. వారం తర్వాత మరో రూ. 5 వేలు వసూలు చేశాడు. బాధితుడి నుంచి డబ్బులు దండుకునేందుకు షబ్బీర్ అలీ పథకం పన్నాడు. అందులో భాగంగా ఇద్దరు వ్యక్తులను గౌస్ ఇంటికి పంపి టాస్క్‌ఫోర్సు పోలీసులమని గౌస్‌ను టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి పంపించాలని అతడి భార్యకు చెప్పించాడు. ఇదే విషయాన్ని ఆమె గౌస్‌కు తెలిపింది. అనంతరం షబ్బీర్ బాధితుడికి ఫోన్‌చేసి కేసు మూయిస్తానని రూ. 40 వేలు డిమాండ్ చేశాడు. మరుసటి రోజు బాధితుడి సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి వెళ్లగా తమ సిబ్బంది రాలేదని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించి శుక్రవారం గౌస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు షబ్బీర్ అలీ, మహ్మద్ సయ్యద్, మహ్మద్ గయ్యాజ్‌పై కేసు నమోదు చేశారు.

నేడు మాదన్నపేట మండీలో బోనాలు

చంచల్‌గూడ: శ్రావణ మాసం సందర్భంగా మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లోని భూలక్ష్మీ ఆలయంలో బోనాల ఉత్సవాలను ఆదివారం నిర్వహిస్తున్నారు. మండీలోని కూరగాయల వ్యాపారులు సామూహికంగా బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. సోమవారం అమ్మవారి ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కృష్ణుడి అల్లరి.. గోపికల సందడి



శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో ఉత్సాహంగా నిర్వహించారు. వివిధ విద్యాసంస్థలో చిన్నారులు కన్నయ్య, గోపికల వేషధారణలతో సందడి చేశారు.

– ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం


కొత్తపేట బచ్‌పన్-అకాడమిక్ హైట్స్ పాఠశాలలో..




కృష్ణాష్టమి వేడుకల్లో కేంబ్రిడ్జ్ పాఠశాల చిన్నారులు


నవ్య జూనియర్ కాలేజ్‌లో.. ఉట్టి కొట్టి వేడుకలు ప్రారంభిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి


శ్రీకృష్ణుడు గోపికల వేషధారణలో విద్యార్థులు


జైపురికాలనీ బ్లైండ్స్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో..